# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **టిటిడి అమలు చేస్తున్న విధానాలు ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **తెలంగాణలో రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈ రోజు విడుదల చేస్తారు.**

3. **సేంద్రియ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

4. **యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.**

5. **ప్రపంచ జల దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం.**

==========================

తిరుమల తిరుపతి దేవస్థానం-టిటిడి అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. తిరుమలలో నిన్న పర్యటించిన ముఖ్యమంత్రి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కృత్రిమ మేధ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈ రోజు విడుదల చేస్తారు. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఈ రోజు సాయంత్రం 4గంటలకు జరిగే సభలో నిధులను విడుదల చేస్తారు. తెలంగాణలో మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 3,590 కోట్ల రూపాయలను జమ చేస్తారు. ఈ రోజు ఆదివారం సెలవు కావడంతో రైతుభరోసా నిధులు రేపు రైతుల ఖాతాల్లో జమవుతాయి. అలాగే సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో 300 కోట్ల రూపాయలతో నిర్మించిన ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

---------------------------

సేంద్రియ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొర్నెపాడులో జరిగిన ఒక కార్యక్రమంలో మిద్దెతోటలు సాగుచేస్తున్న మహిళలకు అవార్డులను అందజేశారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ, రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు సాగు భూమి సంరక్షణకు ప్రకృతి వ్యవసాయం ఉపయోగపడుతుందన్నారు. రైతులు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడితే మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలియజేస్తూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సనత్ నగర్ నియోజకవర్గం, బేగంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, వ్యాయామం ఒత్తిడి, ఆందోళనను తగ్గించి, మెరుగైన జీవనశైలికి దోహదపడుతుందని తెలిపారు. ఆధునిక పరికరాలతో కూడిన జిమ్ స్థానికుల ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచ జల దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం. మానవ మనుగడకు నీటి ఆవశ్యకతను తెలియజెప్పి, పరిమిత వనరుగా ఉన్న నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలనే అవగాహన ప్రజల్లో కల్పించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి 1993 నుంచి ప్రతీ ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. భావితరాలు నీటి కొరతను ఎదుర్కోకుండా నదులను సంరక్షించాలని ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవస్థానాన్ని కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం కింద అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ పనులకు కేంద్రమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. 'ప్రసాద్' పథకం కింద 58 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేశామని రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా తెలియజేస్తూ

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు

ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్ ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలు నిలుపుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొంటూ,

వాయిస్ ...30.. సెకన్లు

---------------------------

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాంతాలను 850 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరులోని బలిజ పాలెంలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన పార్కును ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, నెల్లూరును హరితనగరంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గం పరిధిలో 47 పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టామని వాటిలో ఇప్పటికే 44 పార్కులను పూర్తిచేసి ప్రారంభించామన్నారు. త్వరలోనే అడ్వెంచర్ పార్క్ , వాటర్ స్పోర్ట్స్ పార్క్ లను ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి , ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

తెలంగాణలోనూ రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ – ఏపీకే ఫైల్స్‌తో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా వాట్సప్, ఎస్ఎంఎస్, టెలిగ్రామ్ ద్వారా ఒక ఫైల్ పంపి.. దాన్ని ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయమంటే అప్రమత్తంగా ఉండాలని అది ఏపీకే ఫైల్ కావొచ్చని చెప్పారు. ఏపీకే ఫైల్ ద్వారా ఫోన్ నియంత్రణ సైబర్ నేరస్థుల చేతికి వెళుతుందని అన్నారు. ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, టెలికాం కంపెనీలు వాట్సప్ ద్వారా ఏపీకే ఫైల్స్ యాప్‌లను పంపవని స్పష్టం చేశారు.

=====================